క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 29వ వార్డు రామజోగిపేటలో నివశిస్తున్న కోరుకొండ ఈశ్వరమ్మ, సూరిబాబు దంపతులు తమ కుమార్తె పెళ్లి ఖర్చుల కోసం ఆర్థిక సాయం చేయాలని ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేని కోరారు. వెంటనే స్పందించి పెళ్లి ఖర్చుల కోసం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. 27వ వార్డు ఆశీల్‌మెట్టలో నివశిస్తున్న వంగలపూడి రాజీ భర్త రాజేష్ ఇటీవల మరణించారు. వారి కుటుంబ పోషణ చాలా ఇబ్బందిగా ఉందని తెలపడంతో ఎమ్మెల్యే సొంత నిధులతో రూ.5 వేలు అందజేశా రు. అలాగే 38వ వార్డు బుక్కావీధి ప్రాంతానికి చెందిన శెట్టి ధనరాజు అనారోగ్య కారణంగా మంచానపట్టాడు. ధనరాజు వైద్య ఖర్చుల కోసం రూ.3వేలు అందజేశారు.

విశాఖలో మిస్సింగ్.. ప్రకాశంలో హత్య

అల్లిపురం: బతుకుదెరువు కోసం శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన బత్తుల దేవ ధరణి కర్నూల్ వెళ్లాడు. అక్కడి నుంచి పనుల నిమిత్తం విశాఖపట్నం వచ్చి పాతనగరం టౌన్ హాల్ ప్రాంతంలో పనులు చేసుకుంటున్నాడు. ఈ నెల 8న అతను అదృశ్యం అయ్యాడు. ఈ మేరకు సన్నిహితులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతను మంగళవారం ప్రకాశం జిల్లాలో హత్యకు గురైనట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ పోలీసులు అక్కడికి వెళ్లారు.

వివాహిత ఆత్మహత్య

అల్లిపురం : వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహారాణిపేట పరిధిలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మహారాణిపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామజోగిపేటకు చెందిన కదిరి జ్యోతి (38) భర్త శివశంకర్‌తో మనస్పర్థల కారణంతో కొంత కాలంగా కొడుకు సుష్మన్ రాజుతో కలిసి జీవిస్తోంది. వారిద్దరినీ కలిపేందుకు ఆమె కుమారుడు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సోమవారం రాత్రి తల్లీకొడుకులు కొద్దిపాటి వాదనలు చేసుకున్నారు. భోజనాల అనంతరం పడుకున్నారు. ఉదయం లేచిన కుమారుడు తల్లి నిద్ర లేవకపోవటంతో తలుపులు కొట్టినా తీయకపోవటంతో కిటికీలో నుండి చూశాడు. ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని తల్లి కనిపించింది. దీంతో అతను చుట్టుపక్కల వారి సహకారంతో కిందకి దించి చూడగా అప్పటికే చనిపోయింది. విషయం తెలుసుకున్న మహారాణిపేట మహిళా ఎస్ఐ కనకరత్న సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపి కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

మహా శివరాత్రికి ఆలయాల ముస్తాబు

కంచరపాలెం: ఈ నెల 18న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. కంచరపాలెం పరిధిలో గౌరీ శంకరాలయం, యల్లబిల్లివారి గౌరీ శంకర పంచాయతన ఆలయం, తిక్కవానిపాలెం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయం, ఇందిరానగర్‌లో లక్ష్మీగణపతి ఈశ్వరాలయం, రామ్మూర్తిపంతులుపేట రామలింగేశ్వరాలయం, సాంబమూర్తినగర్ కాలనీలో అన్నపూర్ణ ఆలయం, 104 ఏరియా బాపూజీనగర్ శివాలయం, ధర్మానగర్ బీవీఎస్ టీవీఎస్ కాలనీలో హేరంబ కోదండ ఉమా మహేశ్వరాలయం, జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం తదితర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శివ పార్వతుల కల్యాణోత్సవం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, రజిత బిల్వార్చన, పూర్ణాహుతి, శతరుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. ఉపవాసం, జాగరణ, కోసం ఆలయ కమిటీ నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రంగులతో ఆలయ గోపురాలు కళకళలాడుతున్నాయి. ఆయా ఆలయాలకు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ఆలయాలకు నూతనంగా రంగులు వేసి తీర్చిదిద్దుతున్నారు. అవసరమైన మరమ్మతులు కూడా చేస్తుండడంతో ఆలయాలు నూతన శోభ సంతరించుకున్నాయి.



ఉమామహేశ్వరాలయం ముఖద్వారానికి ముస్తాబు...



రంగులు దిద్దుకుంటున్న జ్ఞానాపురం విఘ్నేశ్వర పార్వతీశ్వరాలయం

టౌన్ ప్లానింగ్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని, కట్టమూరి సతీష్, బానాల శ్రీనివాసరావు తదితరులు

డాబాగార్డెన్స్: రాష్ట్ర కంట్రీ అండ్ టౌన్‌ప్లానింగ్ అసోసియేషన్ డైరీని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టమూరి సతీష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్ బానాల సత్య సూర్య శ్రీనివాసరావు, జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు మంగళవారం జీవీఎంసీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జోనల్ అధ్యక్షుడు ఐవీ రమణమూర్తితో పాటు డీసీపీలు సంజీవ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, సహబాన్ శాస్త్రి, అరుణవల్లి, సీహెచ్ రఘునాథరావు, డి. శ్రీనివాస్, పాత్రో, తేజ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలు

మహారాణిపేట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ పిలుపు మేరకు జరిగిన నిరసన ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. వీఆర్ఏల జిల్లా అధ్యక్షుడు ఎ.సత్యం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలి



పిల్లలకు పెన్నులు, పుస్తకాలు అందజేస్తున్న ఏసీపీ వివేకానంద

డాబాగార్డెన్స్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగాలని దిశ పోలీస్ స్టేషన్ ఏసీపీ సీహెచ్ వివేకానంద అన్నారు. అంబేడ్కర్ యువసేన ఆధ్వర్యంలో బాబాసాహెబ్ జయంతి ఉత్సవాలు ఏవీఎన్ కాలేజీ దరి రెల్లివీధి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలువురు పిల్లలకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ దేశానికి గాంధీ, నెహ్రూ ఎంతటి వారో.. అంబేడ్కర్ కూడా అంతే అన్నారు. ఈ దేశానికి.. మరీ ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల కోసం అంతకంటే గొప్పవారని కొనియాడారు. తాను ఈ స్థాయికి ఎదిగానంటే బాబా సాహెబ్ చలవేనన్నారు. పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. ఏపీ మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ మాట్లాడుతూ బాబా సాహెబ్‌లా పిల్లలు చదువుకుని వృద్ధిలోకి రావాలని, అందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. అంబేడ్కర్ యువసేన అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో యువసేన కార్యదర్శి మాడుగుల సత్యనారాయణ, పి. నందు, కళ్యాణిముని, నిరంజన్‌కుమార్, బంగారి రవిశంకర్, బొగ్గు రాజు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాఖ విద్య: పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో పని చేస్తున్న అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఏపీ టెక్నికల్, ప్రొఫెషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.పావని అన్నారు. మంగళవారం విశాఖ నగరంలోని పలు కళాశాలల అధ్యాపకులను కలుసుకున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీల్లో పని చేస్తున్న అధ్యాపకులకు వృత్తిపరమైన భద్రత కల్పించి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలన్నారు. నిరుద్యోగ పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు పొందేలా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

జాతీయ సహాయ కార్యదర్శిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్



జ్ఞాపిక అందుకుంటున్న జాతీయ సహాయ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్

మహారాణిపేట : నగరానికి చెందిన డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ హోమియో వైద్యుల సంస్థ జాతీయ సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో హరియానాలోని పంచకుల (చండీగఢ్)లో జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు ఘనంగా నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి హోమియో వైద్యులు పాల్గొని శాస్త్ర విధానాలు, ఆధునిక చికిత్స తదితర అంశాలను బోధించారు. అనంతరం జరిగిన ఐఐహెచ్‌పీ జాతీయ ఎన్నికలో నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు రాజేంద్రప్రసాద్‌ను దక్షిణ భారత్‌కు జాతీయ జాయింట్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. గతంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్ పలు పదవులు నిర్వహించి సంస్థ ఆంధ్ర శాఖకు చక్కటి గుర్తింపు తీసుకొచ్చారు. నగరానికి చెందిన వైద్యులు ఎస్. మురళీకృష్ణ, కౌముది పద్మమాల, డి.నిత్య, సోనియా హెమ్నాని, ఎం.రమణారావు, వై.రామాంజనేయులు వివిధ అంశాలపై ప్రసంగించారు. డాక్టర్ కౌముది పద్మమాల వైద్య విద్యార్థులకు క్విజ్, డిబేట్ పోటీలు నిర్వహించారు. విశాఖకు చెందిన ఆంధ్ర శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ పి.సతీష్, డాక్టర్ ధవళ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



జ్ఞానాపురంలో ఫుట్‌పాత్‌లపై దుకాణాలు తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి బీఆర్‌టీఎస్, రైల్వే స్టేషన్ రహదారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై జీవీఎంసీ స్క్వాడ్, జోన్–5 టౌన్‌ప్లానింగ్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు, పాదచారులకు ఇబ్బంది కలిగిస్తున్నా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పాదచారులకు వ్యాపారులు సహకరించాలని కోరారు. భవిష్యత్‌లో ఆక్రమణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మళ్ల అప్పారావు, ఎస్ఐ పాపారావు, ఏఎస్ఐ ఉలహక్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి ఆపన్నహస్తం

అల్లిపురం: రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధుడిని మమత చారిటబుల్ ట్రస్ట్ ఆదుకుంది. ట్రస్ట్ చైర్మన్ మమత తెలిపిన వివరాల ప్రకారం సుమారు 70 సంవత్సరాలు గల బీఎస్ ప్రసాద్ ఒక చైర్‌పై కాలు పురుగులు పట్టి దయనీయ స్థితిలో ఉన్నాడు. ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ఆమె అక్కడికి చేరుకుని అతనిని పరిశీలించగా వృద్ధుని కాలు పురుగులు పట్టి దుర్వాసన రావటంతో ఆయనకు సపర్యలు చేసి అతన్ని పెందుర్తి లయోలా హోమ్‌లో చేర్పించారు. అక్కడ కాలికి డ్రెస్సింగ్ చేసి ఆశ్రయం కల్పించారు.



రైల్వేస్టేషన్‌లో నిస్సహాయ స్థితిలో వున్న వృద్ధుడిని పరామర్శిస్తున్న మమత

అమర వీరులకు శ్రద్ధాంజలి



నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం పుల్వామా దాడిని స్మరిస్తూ అధ్యాపకులు, విద్యార్థినులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. వారి సంస్మరణార్థం కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిచాలని ఈ కార్యక్రమం ద్వారా అమర వీరులకు నివాళులు అందించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ కె. గీతాంజలి, కళాశాల అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ కె.సుధ, విద్యార్థినులు పాల్గొన్నారు.

తడి-పొడి చెత్త వినియోగంపై అవగాహన



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న జోనల్ కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జోన్–5 పబ్లిక్‌హెల్త్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తడి–పొడి చెత్త, ప్రమాదకర ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించా రు. ప్రతి రోజు తడి–పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, ప్రమాదకర ప్లాస్టిక్‌ను వినియోగించరాదని తెలిపారు. విద్యార్థులు పాఠశా ల పరిసరాలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పారిశుధ్య పనుల్లో తల్లిదండ్రులకు సహకరించాలన్నారు. తరగతి గదులు, పరిసరాలు, టాయిలెట్లు శుభ్రంగా ఉండేలా చూడాలని ఆయాలు, ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ శ్రీధర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, పబ్లిక్‌హెల్త్ సూపర్‌వైజర్ జనార్దన్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలమాంబ అమ్మవారి పరస

డాబాగార్డెన్స్: పాతనగరం 36వ వార్డు రంగిరీజువీధిలో వెలసిన నీలమాంబ 41వ పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. రంగిరీజువీధి, పూలసందు, ఏవీఎన్ కాలేజీ డౌన్, గొడారిగోతులు, వెలంపేట, లక్ష్మీనగర్, కర్రలదొడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పసుపు కుంకుమ, మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 10 గంటలకు బరాటం వెంకట్రావు, రాధ దంపతుల సహకారంతో చినవాల్తేర్ సఫీ గ్రూప్‌చే పులివేషాలు, ఉగ్రనరసింహస్వామి, కింగ్‌కాంగ్, గాడ్జిల్లా బొమ్మల ప్రదర్శన నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి నీలమాంబ మహిళా భక్త సమాజం సౌజన్యంతో గొల్లవీధి సీతారామస్వామి అన్నమాచార్య సంకీర్తన వెల్ఫేర్ అసోసియేషన్‌చే కోలాటం నిర్వహించారు. సంపంగి మురళీకృష్ణ, బాదిరెడ్డి కిరణ్, అక్కిరెడ్డి కనకరాజు, వానపల్లి రాజు, జక్కా బుజ్జి, కాకి సత్యనారాయణ, గుడే రాము, దొడ్డి చిన్నబాబు ఆర్థిక సాయంతో నాగసర్పాల.. కాళీమాత నృత్యం చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి నీలమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో సేవాగరిడి, నీలమాంబ ఆటోస్టాండ్ సౌజన్యంతో పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు దయారామ్ స్వీట్స్ ఎదురుగా నాగా ఈవెంట్స్‌చే బోయ్స్ డ్యాన్స్ కార్యక్రమం, నీలమాంబ సేవా సమాజం సహకారంతో మెయిన్‌రోడ్డు ఏవీఎన్ కాలేజ్ డౌన్‌లో కాకినాడ శ్రీనివాస్‌చే ఆలాపన ఆర్కెస్ట్రా నిర్వహించారు. పరస మహోత్సవాని పురస్కరించుకుని చింతల నాగభూషణరావు, చింతల శేషగిరిరావు సౌజన్యంతో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పరస ఉత్సవం సందర్భంగా ఈ నెల 19 మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించనున్నారు.



నీలమాంబ అమ్మవారు

పుష్పాలంకరణలో దుర్గాలమ్మ



వివిధ రకాల పుష్పాలతో భక్తులకు దర్శనమిస్తున దుర్గాలమ్మ



అలరించిన నాట్యదీపిక అకాడమీ చిన్నారుల నృత్యం

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్‌లోని వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పుష్పాలంకరణలో దుర్గాలమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ నాయన మల్లిబాబు, ధర్మకర్తలు బత్తి మంగరాజు, కండిపల్లి వరలక్ష్మి, కాండ్రేగుల రూపావతి, రమణమ్మ, దశమంతుల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు సౌభాగ్యలక్ష్మిగా..

వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాలమ్మ సౌభాగ్యలక్ష్మి (గాజులతో)గా దర్శనమివ్వనున్నారు. అమ్మవారిని గాజులతో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 16 సాయంత్రం 4 గంటలకు దీపాలంకరణ చేయనున్నారు. 17న తొలేళ్ల ఉత్సవం, 18న మహాశివరాత్రి ప్రత్యేక పూజలు, ఆ రోజు అర్ధరాత్రి 12 గంటలకు అమ్మవారి నేత్రోత్సవం, అత్యంత వైభవంగా తొలిపూజ జరపనున్నారు. 19న అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. 26న మారువారాన్ని పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన (108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నామని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

16న సహస్ర తులసిపూజ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 16న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న భక్తులు

ఛాతీలో నొప్పి.. గుండె పోటు కాదు

మహారాణిపేట : అన్ని గుండె నొప్పులు గుండె జబ్బులు కావు అని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్. నాగేశ్వరరావు తెలిపారు. నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులో భాగంగా మంగళవారం క్రిస్టియన్‌నగర్‌లో జరిగిన ఆర్ఎంపీ వైద్యుల వైద్య విజ్ఞాన సదస్సులో ముఖ్య వక్తగా ప్రసంగించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఆర్ఎంపీ వైద్యులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుండె జబ్బులు, నరాల బలహీనతపై ప్రత్యేక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఛాతీలో ఏ భాగంలో నొప్పి కలుగుతుందో పరిశీలించాలన్నారు. ఇతర వ్యాధుల్లో వచ్చే గుండె నొప్పికి, డైరెక్ట్‌గా వచ్చే గుండెనొప్పికి ఉన్న తేడా గమనించాలని అవగాహన కల్పించారు. స్పాండిలైటిస్, నరాల బలహీనత, మైగ్రేన్, పక్షవాతం వంటి వాటిని గుర్తించాలన్నా రు. గుండె జబ్బుల్లో ఏ వ్యక్తికైనా, కాలు ఎడమ చేయి ఎక్కువగా ఎఫెక్ట్ అవుతాయన్నారు. ప్రథమ చికిత్సగా ఆ క్షణంలో బీపీ చూసి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి ఇవ్వాల్సిన మందుల గురించి నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఆదిత్య వివరించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎంపీ వైద్యుల వ్యవస్థాపక జోనల్ అధ్యక్షుడు జంగం జోషి అధ్యక్షత వహించ గా డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ శివదయాళ్, డాక్టర్ జాన్ అండ్ వెస్లీ, మహిళా జోనల్ కార్యదర్శి ఎన్. సుగుణేశ్వరి, కె.ఎస్.రావు, శ్రీమతి రోజా, జైరావు, ఎల్. గణేష్, అను, శ్రీమతి కుమారి, శివప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది లక్ష్మోజి, ఆదారి శ్రీనివాసరావు, చౌదరి శ్రీనివాసరావు, కార్యదర్శి ఈశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

అల్లిపురం: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వందకు పైగా షెడ్ల నిర్వాహకులు ఎమ్మెల్యేను కలిసి పోర్టు అధికారులు తమను ఖాళీ చేయమంటున్నారని విన్నవించుకున్నారు. దీంతో ఆయన పోర్టు అధికారులతో మాట్లాడి వారిని ఇబ్బంది పెట్టవద్దని తెలిపారు. నష్టపోయిన ఫిషింగ్ బోట్ యజమానులకు ఫిషింగ్ హార్బర్‌లో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించిన మోడర్న్ ఫిష్ మార్కెట్‌లో దుకాణాలు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే సర్వే చేసి రిపోర్టు చేయాలని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసోసియేషన్ సభ్యులు వాసుపల్లి జానకీరామ్, వీరన్న, బర్రి కొండబాబు, బుజ్జి, లక్ష్మణరావు, మున్నా, బాలాజీ, రాము పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి